మంగళవారం 16-7-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 395, పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com





## కర్ణాటక అసెంబ్లీలో ఏఐ కెమెరాలు

మిగతా 2లో



## క్రికెట్ స్టేడియంలో పొగాకు యాడ్స్ బంద్

మిగతా 3లో



## కేదార్‌నాథ్‌లో 228 కేజీల బంగారం మాయం

మిగతా 3లో



## పచ్చిపాలు అందరూ తాగవచ్చా..

మిగతా 5లో

# రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల

## పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్
## రైతుల సందేహాలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు

ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో పంటల రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని ఒక కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్ధిదారుల రుణఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ




సొమ్ము విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్ఎంజీ, ఎల్ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడొచ్చు. లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని తెలిపింది.




# బిఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులు కాలరాస్తున్నారు

- ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు
- అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాసిన కేటీఆర్

ముందడుగు తెలంగాణ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని, కావాలనే విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోందని బిఆర్ఎస్ నేత కేటీఆర్ ఆక్షేపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘటనలకు సంబంధించి ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రతి సందర్భంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ మిగతా 2లో

# రాజ్యసభలో తగ్గిన బిజెపి బలం

- 86కు చేరిన బిజెపి సభ్యుల సంఖ్య
- ఇండియా కూటమి బలం 87



ముందడుగు జాతీయం: రాజ్యసభలో నలుగురు నామినేటెడ్ సభ్యులైన రాకేష్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేష్ జెత్మలానీ పదవీకాలం శనివారంతో పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో బీజేపీ సభ్యుల సంఖ్య 86కు తగ్గింది. అలాగే ఆ పార్టీ నేతృత్వంలోని మిగతా 2లో




# ఆప్ పార్టీపై తీహార్ జైలు అధికారులు ఆగ్రహం

- జైలు విలువలను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడి

ముందడుగు ఢిల్లీ: ఆప్ పార్టీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై చేస్తున్న ఆరోపణలను తిహాడ్ జైలు అధికారులు తీవ్రంగా ఖండించారు. జైలు పరిపాలనా విలువలను దెబ్బ తీయడానికే ఆప్ నేతలు ఇటువంటి అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేజ్రీవాల్ 8.5 కిలోల బరువు తగ్గారని.. ఆయన చక్కెర స్థాయిలు మిగతా 2లో

ముందడుగు
మంగళవారం, 16-7-2024, హైదరాబాద్.

# తెలంగాణలో ఐదు రోజులు భారీ వర్షాలు

## వాతావరణ శాఖ వెల్లడి

ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో రాగల ఐదు రోజులపాటు ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆగ్నేయ, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనంతోపాటు షియర్ జోన్ ఏర్పడిందని ఈ ప్రభావంతోనే వర్షా లు కురుస్తాయని తెలిపింది. ఇవాళ (సోమవారం) కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్,



హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉండటంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ఖమ్మం, జనగాం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 18, 19 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులు కాలరాస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. "ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రోటోకాల్ ఉంటుంది. కాంగ్రెస్ నాయకులుకావాలని భారాస ఎమ్మెల్యేలను అవమానించేలా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు. హుజూరాబాద్, మహేశ్వరం, అసిఫాబాద్ సహా భారాస ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇలాగే జరుగుతోంది. శాసనసభ్యుల హక్కులు, వారికి ప్రోటోకాల్ పరిరక్షణ, గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాసనసభాపతిదే"అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో సభాపతి అధికారాలను వినియోగించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రాజ్యసభలో తగ్గిన బిజెపి బలం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్డీయే బలం కూడా 101కు పడిపోయింది. రాజ్యసభలో మొత్తం 245 మంది సభ్యులకుగాను ప్రస్తుతం 225 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం మెజారిటీ మార్కు 113. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్డీయే బలం (101) మెజార్టీ మార్కు కంటే 12 తక్కువగా ఉంది. అయితే ప్రతిపక్షాలకు చెందిన ఇండియా కూటమి బలం 87గా ఉంది. కాంగ్రెస్‌కు 26, బెంగాల్‌లోని అధికార తృణమూల్‌కు 13, ఆప్‌కు 10 మంది, డీఎంకేకు పది మంది సభ్యులున్నారు.

మరోవైపు ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందడానికి ఎన్డీయేతర పార్టీలపై ప్రభుత్వం ఆధారపడాల్సి ఉంటుంది. ఒడిశాకు చెందిన బీజేడీకి 9 మంది సభ్యులున్నారు. అయితే బీజేడీ ప్రస్తుతం బీజేపీని వ్యతిరేకిస్తోంది. అలాగే నలుగురు సభ్యులున్న తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే కూడా మద్దతు నిరాకరించే పరిస్థితిలో ఉంది. 11 మంది సభ్యులున్న ఏపీలోని వైఎస్ఆర్సీపీ, నలుగురు సభ్యులున్న తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రస్తుతం తటస్థంగా ఉన్నాయి. అయితే బిల్లుల అంశంలో ఈ రెండు పార్టీలు, స్వతంత్ర ఎంపీలు ప్రభుత్వానికి మద్దతిచ్చే అవకాశముంది. అలాగే బీజేపీ నామినేట్ చేసిన 12 మంది సభ్యులు కూడా ప్రభుత్వానికి మద్దతిస్తారు. ఈ నేపథ్యంలో వీరి సహాయంతో బిల్లులను ప్రభుత్వం ఆమోదించే వీలుంది. రాజ్యసభలో ప్రస్తుతం 20 సీట్లు ఖాళీగా ఉన్నాయి.





# వీరు ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేస్తే జరిమానా లేదు

## బెంగుళూర్ ట్రాఫిక్ పోలీస్ నిర్ణయం

ముందడుగు బెంగుళూరు: బెంగళూరులో అంబులెన్స్‌కు దారి ఇవ్వడానికి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా జరిమానా విధించమని పోలీసులు పేర్కొన్నారు. అటువంటి సందర్భంలో ట్రాఫిక్ సిగ్నల్ కెమెరాల ద్వారా జరిమానాలు జారీ చేస్తే ప్రయాణికులు ఇన్‌ఫాంట్రీ రోడ్‌లోని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. కర్ణాటక స్టేట్ పోలీస్ యాప్ ద్వారా కూడా అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) అనుచేత్ పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్న కెమెరాలు ప్రతీ ఐదు సెకన్లకు వాహనదారుల కదలికలను రికార్డ్ చేస్తాయని, అంబులెన్స్‌కు దారివ్వడానికి వాహనదారుడు సిగ్నల్ జంప్ చేసినట్లు గుర్తిస్తే వెంటనే జరిమానా రద్దు అవుతుందన్నారు.





# కర్ణాటక అసెంబ్లీలో ఏఐ కెమెరాలు

## సభ్యుల రాకపోకలపై పర్యవేక్షణ

ముందడుగు కర్ణాటక: కర్ణాటక అసెంబ్లీ సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధుల హాజరును పర్యవేక్షించేందుకు కర్ణాటక అసెంబ్లీ కీలక చర్యలు చేపట్టింది. ఇందుకోసం అసెంబ్లీలో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో కూడిన 'ఏఐ' కెమెరాలను ఏర్పాటు చేసింది. చట్టసభ సభ్యుల రాకపోకలతోపాటు వారు సభలో ఉన్న వ్యవధిని నమోదు చేసేందుకు ఈ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. సమావేశాల్లో సభ్యుల హాజరు, సభలో వారి భాగస్వామ్యాన్ని మరింత మెరగుపరిచేందుకు ఈ విధానాన్ని తీసుకువచ్చామని అధికారులు పేర్కొన్నారు. "కోరం బెల్ మోగకముందే అసెంబ్లీలోకి వచ్చే ఎమ్మెల్యేలను గుర్తించి, వారి పేర్లను చదివి ప్రశంసించే సంప్రదాయం ఉంది. కొందరు సీనియర్ సభ్యులు ఆలస్యంగా వచ్చినప్పటికీ సాయంత్రం ఎక్కువ సమయం సభలోనే ఉంటుంటారు. అలాంటి వారిని గుర్తించకపోవడం అన్యాయంగా భావిస్తున్నాం. ఈ క్రమంలో సభలోకి రావడం, నిష్క్రమణ సమయాన్ని నమోదు చేసేందుకు కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేశాం" " అని స్పీకర్ యూటీ ఖాదర్ పేర్కొన్నారు. ఈ విధానం తీసుకురావడంతో చొరవ చూపిన స్పీకర్‌ను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, విపక్ష నేత ఆర్ ఆశోకాతోపాటు ఇతర చట్టసభ సభ్యులు అభినందించారు.

# ఆప్ పార్టీపై తీహార్ జైలు అధికారులు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ఐదుసార్లు 50 కంటే తక్కువకు పడిపోయాయని ఇటీవల ఆప్ నేతలు పేర్కొన్నారు. జైల్లోనే ఆయనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై తిహార్ జైలు అధికార యంత్రాంగం సోమవారం స్పందించింది. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఏప్రిల్ 1న కేజ్రీవాల్‌ను తిహార్ జైలుకు తీసుకువచ్చినప్పుడు ఆయన బరువు 65 కిలోలు అని, ఎన్నికల నేపథ్యంలో సుప్రీం బెయిల్ మంజూరుచేసే సమయానికి 65 కిలోలకు పెరిగారని పేర్కొన్నారు. అనంతరం అతడు జైల్లో లొంగిపోయిన సమయంలో ఆయన బరువు 63.5 కిలోలుగా నమోదైందన్నారు. ప్రస్తుతం ఆయన 61.5 కిలోల బరువు ఉన్నారని జైలు అధికారులు వెల్లడించారు.



ముందడుగు
మంగళవారం, 16-7-2024, హైదరాబాద్.


# క్రికెట్ స్టేడియంలో పొగాకు యాడ్స్ బంద్

## బీసీసీఐకి కేంద్రం ఆదేశాలు జారీ చేసే ఆలోచన



ముందడుగు జాతీయం: పొగాకు వాడకం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు క్రికెట్ స్టేడియంలో పొగాకు ప్రకటనకు సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ ఓ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పొగాకు వినియోగాన్ని ప్రోత్సహించేలా ఉండే ప్రకటనలను ఇకపై క్రికెట్ స్టేడియంలో ప్రదర్శించకూడదని బీసీసీఐకి ఆదేశాలు జారీ చేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.

పాన్ మసాలా, పొగాకు మిశ్రమం ఉన్న చూయింగ్ గమ్, గుట్కా, పొగ రహిత పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన యాడ్స్‌ను టోర్నీలు జరిగే సమయంలో మైదానంలో ప్రదర్శించవద్దని ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఇకనుంచి ప్రజలను ఈ దురలవాటుకు బానిసను చేసేలా ప్రముఖ నటులు, మాజీ క్రికెటర్లు వీటిలో నటించకుండా ఆంక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని సూచించనుంది. ఈ యాడ్స్ ద్వారా పొగాకు ఉత్పత్తులను తీసుకునేందుకు ప్రజలను ప్రోత్సహించడమే అవుతుందన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఇది దేశ యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదని తెలుస్తోందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.



# కేదార్‌నాథ్‌లో 228 కేజీల బంగారం మాయం

## అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు

ముందడుగు ఉత్తరాఖండ్: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ ఆలయంలో అతి పెద్ద కుంభకోణం చోటు చేసుకుందని ఉత్తరాఖండ్‌కు చెందిన జ్యోతిర్మఠ్ పీఠాధిపతి శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఆలయానికి చెందిన 228 కేజీల బంగారాన్ని మాయం చేశారని ఆరోపించారు. కేదార్‌నాథ్ ఆలయంలో చోటు చేసుకున్న ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీదే ఉందని తేల్చి చెప్పారు. దర్యాప్తు జరపాలంటూ తాను ఇదివరకు డిమాండ్ చేసినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదని పేర్కొన్నారు.

# ఏపి, తెలంగాణ సిఐయస్‌సిఈ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



ముందడుగు హైదరాబాద్: జాన్సన్ గ్రామర్ స్కూల్, కుంట్లూరు ఆధ్వర్యంలో జూలై 15, 2024న సిఐయస్‌సిఈ ఏపి మరియు తెలంగాణా ప్రాంతీయ బాలికల కబడ్డీ టోర్నమెంట్ (14, 17 మరియు 19 సంవత్సరాల లోపు బాలికల) ప్రారంభం అయ్యింది. జాన్సన్ గ్రామర్ స్కూల్, కుంట్లూరు ఈ రెండురోజుల (జులై 15 మరియు 16) ప్రాంతీయ కబడ్డీ టోర్నమెంట్ (బాలికల) ఆతిథ్యం ఇచ్చి విశిష్ట గౌరవాన్ని పొందింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వివిధ సిఐయస్‌సిఈ పాఠశాలల నుండి 350 మంది విద్యార్థినులు ఈ పోటిలో పాల్గొంటున్నారు. రేపటితో ఈ టోర్నమెంట్ ముగుస్తుంది. స్కూలు స్థాయిలోనే బాలురతో పాటు బాలికలను కూడా క్రీడాల్లో భాగము చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ బాలికల కబడ్డి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు, కుంట్లూరు మరియు ఎల్ బి నగర్ జాన్సన్ గ్రామర్ స్కూల్ చైర్మన్ డాక్టర్. బి. మల్లికార్జున్ రావు తెలిపారు. ముఖ్యంగా కబడ్డి లాంటి క్రీడాల ద్వారా చురుకుదనం మరియు శరీరిక పటుత్వం వస్తుందని, ఇది పెరుగుతున్న బాల బాలికలకు ఎంతో అవసరమని మల్లికార్జున్ రావు అన్నారు.

# రెండు రోజులు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన రోగి

## లిఫ్ట్ ఆగిపోయిన పట్టించుకొని సిబ్బంది

## ఆసుపత్రి నిర్లక్ష్యంపై ఆరోగ్యమంత్రి విచారణ

ముందడుగు కేరళ: ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు నిర్లక్ష్యానికి నిలువుటద్దమని విషయం తెలిసిందే. అలాంటిది కేరళలో వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన ఓ రోగికి షాకింగ్ అనుభవం ఎదురైంది. ప్రమాదవశాత్తూ అక్కడ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి.. రెండు రోజులు అందులోనే ఉండి ప్రాణాలతో బయటకు పడ్డ సంఘటన కేరళ రాజధాని తిరువనంతపురంలో చోటు చేసుకుంది. ఉళ్లూరు ప్రాంతానికి చెందిన 59 ఏళ్ల రవీంద్రన్ నాయర్ తీవ్రమైన వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం వైద్య పరీక్షల కోసం తిరువనంతపురం ప్రభుత్వ



మెడికల్ కళాశాల ఆసుపత్రికి వెళ్లాడు. ఓపీ బ్లాక్‌లోని మొదటి అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కాడు. అయితే అదే సమయంలో ఎలివేటర్‌లో సమస్య తలెత్తి ఆగిపోయింది. దీంతో రవీంద్రన్ అందులోనే ఇరుక్కుపోయాడు. అలారం ఎన్ని సార్లు నొక్కినా ప్రయోజనం లేదు. లిఫ్ట్ బలంగా ఊగడం వల్ల రవీంద్రన్ ఫోన్ కూడా కిందపడి పగిలిపోయింది. దీంతో తాను లిఫ్ట్‌లో చిక్కుకుపోయినట్లు ఎవరికీ చెప్పే అవకాశం లేకుండాపోయింది. సోమవారం ఉదయం లిఫ్ట్ ఆపరేటర్ రొటీన్ వర్క్ కోసం ఆసుపత్రికి వచ్చారు. అప్పుడు అది పనిచేయడం లేదని గుర్తించి రిపేర్ చేసి లిఫ్ట్ డోర్ తెరవగా.. అందులో రవీంద్రన్ స్పృహతప్పి కన్పించాడు. దీంతో అతడికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై స్పందించిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్.. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

ముందడుగు
మంగళవారం, 16-7-2024, హైదరాబాద్.

## రూ.1000 కోట్లు ఫండింగ్‌ను ప్రకటించిన పర్పుల్ గ్రూప్




ముందడుగు హైదరాబాద్: భారతదేశంలోని ప్రముఖ ఓమ్నిచానెల్ బ్యూటీ ప్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన పర్పుల్ గ్రూప్, ఇతర పెట్టుబడిదారుల భాగస్వామ్యంతో పాటు అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ద్వారా ₹1000 కోట్ల వరకు నిధులను సేకరిస్తున్నట్లు ప్రకటించింది. ఇది ప్రాథమిక, ద్వితీయ షేర్ల కలయికను కలిగి ఉంటుంది. వ్యూహాత్మకంగా తన ఆఫ్‌లైన్ ఉనికిని విస్తరిస్తూ, పర్పుల్ గ్రూప్ తన ఆరు డైరెక్ట్-టు-కన్స్యూమర్ ప్రైవేట్ బ్రాండ్‌లను రిటైల్ చేస్తుంది. వీటిలో ఫేసెస్ కెనడా, ఆల్ప్స్ గుడ్‌నెస్, గుడ్ వైబ్స్, కార్మేసి, డెర్మ్ డాక్ మరియు నై బే మల్టీ టచ్‌పాయింట్‌లలో ఉన్నాయి. బ్రాండ్ భారతదేశంలో 1500కు పైగా సహాయక మరియు 40000+ టచ్‌పాయింట్‌లను కలిగి ఉంది.

పెట్టుబడికి సంబంధించి పర్పుల్‌లో సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మనీష్ తనేజా మాట్లాడుతూ, “సౌందర్యాన్ని ప్రజాస్వామ్యీకరించడం, అందరికీ అందుబాటులో ఉంచడం మా లక్ష్యం. మేము భారతదేశం వ్యాప్తంగా పలువురు సౌందర్య ప్రియులను చేరుకున్నాము. ఇదే బాటలో మేము ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉంది అన్నారు.

# ఇంజినీరింగ్‌లో మరో 10వేలకు పైగా సీట్లు.. వెబ్ ఆప్షన్ల గడువు 17 వరకు

ముందడుగు హైదరాబాద్: డీఎస్సీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.

### వారంలో బీటెక్ ఫీజుల పెంపునకు నోటిఫికేషన్!

2025-26, 2026-27, 2027-28 సంవత్సరాల ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్‌ఆర్‌సీ) వారంలో నోటిఫికేషన్ జారీచేయనుంది. ఇప్పుడు అడ్మిషన్లు పొందేవారికి పాత ఫీజులే వర్తించనుండగా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి. అక్టోబర్ 30 వరకు కాలేజీలు ప్రతిపాదనలు సమర్పించేందుకు అవకాశమిచ్చి, నవంబర్, డిసెంబర్‌లో కాలేజీలను ప్రత్యక్ష విచారణకు పిలుస్తారు. ఇంజినీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బయోటెక్నాలజీ ఫీజులను సైతం పెంచుతారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని టీఏఎఫ్‌ఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, ఓయూ, జేఎన్టీయూ రిజిస్ట్రార్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి వెంకటేశ్ హాజరై చర్చించారు.



## డిగ్రీలు చదివితే ఏం లాభం లేదు

### యువత పంక్చర్ షాపు పెట్టుకోవాలి

### గుణ ఎమ్మెల్యే విద్యార్థులకు వింత సలహా




ముందడుగు మధ్యప్రదేశ్: డిగ్రీల వల్ల ఏ ఉపయోగం లేదని, యువత పంక్చర్ షాప్ తెరుచుకోవాలని విద్యార్థులకు గుణ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా వింత సలహా ఇచ్చారు. మధ్యప్రదేశ్ గుణ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా ఆదివారం ‘పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా మాట్లాడారు. డిగ్రీలు పొందడం వల్ల ఏమీ లాభం లేదని తెలిపారు. విద్యార్థులు జీవనోపాధి పొందేందుకు మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ దుకాణాన్ని తెరవాలని సూచించారు. ‘మేం ఈరోజు పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్నాం. ఈ కాలేజీ డిగ్రీలతో ఏమీ జరుగదు. ఒక వాక్యాన్ని గుర్తుంచుకోవాలని నేను ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నా. డిగ్రీలకు బదులుగా, జీవనోపాధి కోసం కనీసం మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాప్ తెరవండి’ అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

## పెళ్లిలో చేపల కూర లేదని గొడవ

### వధువు చెంపపై కొట్టిన వరుడు

ముందడుగు ఉత్తరప్రదేశ్: తన పెళ్లి విందులో చేపల కూర లేకపోవడంతో పెళ్లి కొడుకు తన బంధువులతో కలిసి వధువు బంధువులను కొట్టాడు. ఈ గొడవలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 11న వరుడు అభిషేక్ శర్మ తన కుటుంబం, బంధువులతో కలిసి పెళ్లి ఊరేగింపుగా ఆనంద్ నగర్ గ్రామానికి చేరుకున్నాడు. వధువు సుష్మ, అతడు పెళ్లి దండలు మార్చుకున్న తర్వాత వరుడి తరుపు వారు విందు ఏర్పాటు చేసిన చోటుకు వెళ్లారు.


పనీర్, పలావ్‌తోపాటు వివిధ కూరలతో శాఖాహార వంటకాలు మాత్రమే ఉండటాన్ని వరుడు, అతడి బంధువులు గమనించారు. మాంసాహారం వంటలు లేవని తెలియడంతో ఆగ్రహించారు. చేపల కూర ఎందుకు లేదని



ప్రశ్నించిన వరుడు అభిషేక్ శర్మ వధువు చెంపపై కొట్టాడు. తన బంధువులతో కలిసి వధువు తరపు వారిపై దాడి చేశాడు. దీంతో ఇరువర్గాల వారు విచక్షణారహితంగా ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో ఆరుగురు గాయపడ్డారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని అదుపు చేశారు. వరుడు అభిషేక్ శర్మతోపాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## అక్రమ అరెస్ట్ ప్రభుత్వానికి సిగ్గుచేటు

ముందడుగు ములుగు: బీజేవైఎం నాయకులను అర్ధరాత్రి 12 గంటలకు అక్రమ అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఆయన మాట్లాడుతూ బీజేవైఎం నాయకులను అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేశారని,ప్రజాస్వామ్యాన్ని కూని చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేసే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఏ రాజకీయ పార్టీ అయినా కూడా ప్రజల పక్షాన నిలబడే వ్యక్తి ఎవరు అయినా కూడా గొంతు



విప్పే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షులు రాయించు నాగరాజు, జిల్లా నాయకులు ఎల్కతుర్తి శివ,జిల్లా ఉపాధ్యక్షులు కల్లెపు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి ఇనుముల మహేష్, బోగిరి రాకేష్, ఇరుసవట్ల నాగసాయి, నూనెటి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు
మంగళవారం, 16-7-2024, హైదరాబాద్.




### పచ్చి పాలు తాగితే

# ఆరోగ్యానికి మంచిదేనా..

## వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటీ పచ్చిపాలు అందరూ తాగవచ్చా..



ముందడుగు ఆరోగ్యం:
పాలు ఆరోగ్యానికి మంచి ఆహారం.. పాలలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇందులో కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఇది ఎముకలు, దంతాలను బలపరుస్తుంది. హృదయ స్పందనను సురక్షితంగా ఉంచుతుంది. రక్తంలో గడ్డకట్టడాన్ని అరికడుతోంది. కండరాలు, నరాల పనితీరులో కూడా పాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కాని చాలామంది పచ్చిపాలతో అనేక రకాలు ఆరోగ్య ప్రయోజనాలుంటాయని నమ్ముతారు. పచ్చి పాలు తాగడం వెనుక వాదన ఏమిటంటే, పచ్చి పాలలో ఎక్కువ పోషకాలు ఉంటాయి . దానిని తాగడం వల్ల అలర్జీలు, ఉబ్బసం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. అదే సమయంలో లాక్టోస్ అసహనం ఉన్నవారికి కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఇందులో కొంచెం నిజం ఉంది

పచ్చి పాలలో హానికరమైన బ్యాక్టీరియా

క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ నివేదిక ప్రకారం డైటీషియన్ డాక్టర్ ఎరిన్ రోసీ మాట్లాడుతూ.. మీరు నేరుగా ఆవు లేదా గేదె పచ్చి పాలను తాగితే అందులో అనేక రకాల హానికరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఈ బ్యాక్టీరియా కారణంగా మీరు అనారోగ్యానికి కూడా గురయ్యే అవకాశముంది. అయితే ఇది అందరికీ జరగకపోవచ్చు. ఎందుకంటే కొందరు వ్యక్తులు ఈ ప్రమాదకరమైన బ్యాక్టీరియాను సులభంగా తట్టుకుంటారు, తేలికపాటి వాంతులు, విరేచనాల తర్వాత స్వంతంగా కోలుకుంటారు. కానీ కొంతమందికి ఇది ఇబ్బందిగా మారుతుంది. సాల్మోనెల్లా బ్యాక్టీరియా, లీషేరియా మోనోసైటోజెన్‌లు వంటి బ్యాక్టీరియా పచ్చి పాలలో ఉంటాయి. ఇవి కడుపుకు చాలా హాని కలిగిస్తాయి. ఇవి తక్షణ ప్రభావం చూపకపోతే, రోగనిరోధక వ్యవస్థ బాగా ప్రభావితమవుతుంది. విరేచనాలు, కడుపు నొప్పి, వికారం, వాంతులు వంటి సమస్యలు వెంటనే వస్తాయి. ఈ హానికరమైన బ్యాక్టీరియా పచ్చి పాలతో కడుపులోకి ప్రవేశిస్తే.. ఆరోగ్యవంతమైన పెద్దలకు పెద్దగా తేడా ఉండదని, అయితే ఇది పిల్లలకు, వృద్ధులకు, గర్భిణీ స్త్రీలకు పెద్ద తేడాను కలిగిస్తుందని, వారు కూడా అనారోగ్యానికి గురవుతారని డాక్టర్ ఎరిన్ రోసీ చెప్పారు.

### పచ్చి పాల గురించి అపోహ ఏమిటి?

పాలను మరిగించడం వల్ల దానిలోని పోషకాలు నశిస్తాయి అని ప్రజలు నమ్ముతారు. అయితే శాస్త్రీయ వాస్తవం ఏమిటంటే ఇది పోషక మూలకాలకు ఎటువంటి నష్టం కలిగించదు. మనం 20 సెకన్ల పాటు 80 డిగ్రీల వరకు వేడి చేస్తే, హానికరమైన బ్యాక్టీరియా చనిపోతుంది, దాని వల్ల ఎటువంటి హాని జరగదు. పాశ్చరైజ్డ్ పాలు అదే విధంగా ఉంటాయి. దీనిని 80 డిగ్రీలకు వేడి చేసి, 20 సెకన్లలో సున్నా డిగ్రీలకు తీసుకురావడం వల్ల హానికరమైన బ్యాక్టీరియా దానిలో పెరగదు, పాలు ఆరోగ్యంగా మారుతుంది.

## మోహన్ లాల్ భామ ప్రాచీ టెహ్లాన్ హొయలు..

రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ నటించిన త్రిశంకు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఢిల్లీ భామ ప్రాచీ టెహ్లాన్ (Prachi Tehlan). భారత మాజీ నెట్‌బాల్, బాస్కెట్ బాల్ క్రీడాకారిణి అయిన ఈ సుందరికి సోషల్ మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. ఎప్పటికప్పుడు ట్రెండీ, హాట్ లుక్స్‌లో నెట్టింట దర్శనమిస్తూ నెటిజన్లకు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. ఈ బ్యూటీ తాజాగా కంప్లీట్ వైట్ అండ్ వైట్ కాస్ట్యూమ్‌లో మెరిసిపోతూ కెమెరాకు ఫోజులిచ్చింది. కాటుక కనులతో సోఫాపై హొయలుపోయింది. మీ ఫేవరేట్ ఫొటో ఏంటీ..? అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో తన తాజా ఫొటోలను ప్రాచీ టెహ్లాన్ షేర్ చేసింది. కండ్లు పక్కకు తిప్పకోనీయకుండా చేస్తున్న ప్రాచీ టెహ్లాన్ స్టిల్స్‌పై మీరూ ఓ లుక్కేయండి మరి. జీతూ జోసెఫ్ డైరెక్షన్‌లో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తోన్న భారీ ప్రాజెక్టులో రామ్ (Ram)లో కీలక పాత్రలో నటిస్తోంది ప్రాచీ టెహ్లాన్. యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రం చాలా కాలం క్రితమే లాంచ్ కాగా.. కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది.

## లేడీ ఓరియెంటెడ్ స్పై మూవీలో శార్వరి వాఘ్

బాలీవుడ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టి కథానాయికగా రాణిస్తున్నది శార్వరి వాఘ్. 'బంటీ ఔర్ బబ్లీ 2' చిత్రం ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ప్రస్తుతం ఈ భామ యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కిస్తున్న 'అల్ఫా' చిత్రంలో కీలకపాత్రను పోషించనుంది. యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి లేడీ ఓరియెంటెడ్ స్పై చిత్రమిదే కావడం విశేషం. ఇందులో అలియాభట్ లీడ్ రోల్‌ని పోషిస్తున్నది.  ఇప్పటికే ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నది. 'అల్ఫా' చిత్రంలో శార్వరి వాఘ్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని, యాక్షన్ ప్రధానంగా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమా కోసం శార్వరి వాఘ్ ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నది. ఫిజికల్‌గా మరింత ఫిట్‌గా కనిపించేందుకు కసరత్తులు చేస్తున్నది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో అందరిని ఆకట్టుకుంటున్నాయి. త్వరలో ఆమె 'అల్ఫా' షూటింగ్‌లో పాల్గొనబోతున్నది. ఆదిత్యచోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

